సకల కళల కోట.. జరజాపుపేట!

- కర్ర, కత్తిసాములకు కేరాఫ్ అడ్రస్‌గా జరజాపుపేట
- కళల్లో ఆరితేరిన వారితో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ
- ప్రావీణ్యులైన 150 మందితో రాష్ట్ర స్థాయి ప్రదర్శనలు
- పండగల్లో ప్రత్యేకత చాటుకుంటున్న కళాకారులు



జరజాపుపేటలో కర్రసాము శిక్షణ ఇస్తున్న దుర్గాప్రసాద్(ఫైల్)

నెల్లిమర్ల: కళలకు కేరాఫ్ అడ్రస్‌గా మండలంలోని జరజాపుపేట నిలుస్తోంది. ప్రాచీన కళలు అంతరించిపోతున్న వేళ.. ఇప్పటికీ కర్రసాము, కత్తిసాము, కోలాటాలు బతికున్నాయంటే కారణం గ్రామానికి చెందిన కళాకారులు పాలుబోతు నారాయణరావు, ఆయన కుమారులు దుర్గాప్రసాద్, ఆనంద్‌లు. యుద్ధవిద్యల్లో బాగా ఆరితేరిన వీరు తమ గురువులైన పాలుబోతు సూర్యనారాయణ, చాపా రాములు, చాపా సూర్యనారాయణల పేరిట విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. ఆత్మరక్షణకు ఉపయోగపడే ఈ విద్యలను నేర్చుకునేందుకు విద్యార్థులు కూడా ఆసక్తి చూపిస్తున్నారు. వేసవి సెలవుల్లో వీరి వద్ద శిక్షణ పొందేందుకు పలువురు ఎగబడుతుండడం విశేషం. ఇప్పటి వరకు వీరి వద్ద మొత్తం 150 మంది ఆయా విద్యల్లో నైపుణ్యం సాధించి, రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.

2012లో గుంటూరు పోటీల్లో పతకాలు..

2012లో గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి ప్రదర్శనల్లో దుర్గాప్రసాద్, ఆనంద్‌లు విశేష ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఉత్తరాంధ్ర వ్యాప్తంగా ఎన్నో ప్రాంతాల్లో జరిగే ప్రదర్శనలకు కూడా వీరికి ఆహ్వానం ఉంటుంది. వీరితో పాటు వీరి వద్ద శిక్షణ పొందిన వారు కూడా ప్రదర్శనలకు వెళ్తుంటారు. ఇలాంటి గురువుల వద్ద శిక్షణ పొందుతున్న చిన్నారులు సైతం కర్రసాము, కత్తిసాముకు వెనుకాడరు. ధైర్యంగా తాము నేర్చుకున్న విద్యను చూపించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. ఒక్కోసారి గురువులతో పోటీకి కూడా సై అంటారు. కత్తితో నిమ్మకాయలు ముక్కలు చేయడం, సూదిని ముక్కలుగా నరకడం వంటి ప్రదర్శనలను ఎంతో అవలీలగా చేసేస్తుంటారు. మన భవిష్యత్ తరాలకు అందించాల్సిన కళలను వీరు ఇంకా బతికిస్తున్నందున అందరూ వారికి కళల పట్ల ఉన్న మక్కువను అభినందిస్తున్నారు. ఎటువంటి ఫీజు లేకుండా బాలలకు ఆత్మరక్షణకు ఉపయోగపడే యుద్ధవిద్యలు నేర్పడాన్ని మెచ్చుకుంటున్నారు.

కళలు.. అంతరించకూడదనే..



కళలు అంతరించకూడదనే సదుద్దేశంతో ఆలోచన చేస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాచీన కళలుగా పేరొందిన కర్రసాము, కత్తిసాము నేడు అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయి. అటువంటి కళలను బతికించాలని చిన్నారులకు శిక్షణ ఇస్తున్నాం. సుశిక్షితులైన వారితో పట్టణాలు, పల్లెల్లో ప్రదర్శనలు ఇస్తున్నాం. – పోలుబోతు నారాయణరావు, గురువు, జరజాపుపేట

ఆడపిల్లల ఆత్మరక్షణకు దోహదం..



మేము నేర్పిస్తున్న కర్ర, కత్తిసాములు ఆడపిల్లలకు ఆత్మరక్షణకు దోహదపడతాయి. ఆకతాయిల కారణంగా ఏర్పడిన ప్రమాదకర పరిస్థితుల నుంచి సురక్షితంగా బయటపడేందుకు ఇవి ఉపయోగపడతాయి. విద్యార్థినులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – పోలుబోతు దుర్గాప్రసాద్, గురువు, జరజాపుపేట

ఎంతో ఇష్టంతో నేర్చుకుంటున్నా..



నాకు సాము చేయడం అంటే ఎంతో ఇష్టం. 12 ఏళ్లుగా యుద్ధ విద్యలు నేర్చుకుంటున్నా. ఇప్పటివరకు చాలాచోట్ల అనేక ప్రదర్శనలు ఇచ్చా. రాష్ట్ర స్థాయి ప్రదర్శనల్లో పతకం సాధించాలన్నదే కల. – తాలాడ యశ్వంత్, విద్యార్థి, జరజాపుపేట పాఠశాల

నాలుగేళ్లుగా మెలకువలు..



నాలుగేళ్లుగా యుద్ధ విద్యల్లో మెలకువలు నేర్చుకుంటున్నా. ఉన్నత స్థాయి పతకాలు పొందేలా శిక్షణ తీసుకుంటున్నా. కళలను బతికించడంతో పాటు భావితరాలకు కళలు అందించేవారిగా ఉంటుండడం అదృష్టం. – కాళ్ల నందిని, విద్యార్థిని, మొయిద, నెల్లిమర్ల మండలం

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీసీతారామస్వామి దేవస్థానంలో శ్రీనమ్మాళ్లు వారి తిరు నక్షత్ర పూజలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజామున ప్రాతఃకాలార్చన అనంతరం యాగశాలలో సుందరకాండ హవనం జరిపించారు. ఆ తర్వాత ఉత్సవమూర్తుల వద్ద సీతారాముల కల్యాణం చేసి నమ్మాళ్లు విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం చేశారు.

విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు

డెంకాడ/పూసపాటిరేగ: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి విజయనగరం జిల్లా కేంద్రంలో షైనింగ్ స్టార్ అవార్డులు సోమవారం అందజేశారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అందజేస్తున్న ఈ పురస్కారాలను మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యేలు అదితి గజపతిరాజు, లోకం నాగమాధవిల చేతులమీదుగా విద్యార్థులకు ఇచ్చారు. భవిష్యత్‌లో కూడా మరిన్ని విజయాలు సాధించి, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మంత్రి, ఎమ్మెల్యేలు ఆకాంక్షించారు.

విజన్ 2047 కార్యాలయం ప్రారంభం

నెల్లిమర్ల: సీఎం చంద్రబాబు పిలుపునిచ్చిన విజన్ 2047 సాధనకు కృషి చేద్దామని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విజన్ 2047 నియోజకవర్గ కార్యాలయాన్ని ఆమె సోమవారం ప్రారంభించారు. అనంతరం కార్యక్రమ లక్ష్యాలను అధికారులకు ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి డి.వెంకటేశ్వరరావు, ఎంపీడీవో రామకృష్ణరాజు, తహసీల్దారు సుదర్శనరావు, నగరపంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక భవనం తొలగింపుపై ఫిర్యాదు

పూసపాటిరేగ: మండలంలోని కొవ్వాడ అగ్రహారం గ్రామంలో ఉన్న శ్మశానవాటిక భవనం తొలగించడంపై తహసీల్దారు టి.గోవిందకు సోమవారం ఫిర్యాదు చేశారు. సర్పంచ్ కోట్ల రామునాయుడు ఎటువంటి తీర్మానం లేకుండా గ్రామస్తుల ఆమోదం లేకుండా భవనం తీయించేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో సోమాదుల సోంబాబు, చందక హరి బాబు, రాజినాయుడు తదితరులు ఉన్నారు.

వైద్య రంగంలోని అధునాతన పద్ధతులు తెలుసుకోవాలి

విజయనగరం ఫోర్ట్: వైద్య రంగంలో ఎప్పటికప్పుడు వస్తున్న అధునాతన పద్ధతులను తెలుసుకోవాలని ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డి.శ్రీహరిరావు సూచించారు. స్థానిక పట్టణంలో తిరుమల మెడికవర్ ఆస్పత్రిలో రోబోటిక్ సర్జరీలపై అవగాహన సదస్సు సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన కొత్త పద్ధతుల ద్వారా శస్త్రచికిత్స చేయడం నేర్చుకోవాలన్నారు. వైద్య రంగంలో వస్తున్న మార్పు లకు అనుగుణంగా వైద్యులు అప్‌డేట్ కావాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఐఎంఏ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.జయచంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను నిర్లక్ష్యం చేయకండి



దివ్యాంగుల గుర్తింపు సర్వేలో పాల్గొన్న ఎంఈఓ నర్సింగరావు, లీలాకృష్ణలు

శృంగవరపుకోట: దివ్యాంగులను నిర్లక్ష్యం చేయకుండా వారి భవిష్యత్ కోసం భవిత కేంద్రాలకు పంపాలని మండల విద్యాశాఖాధికారి బి.నర్సింగరావు తల్లిదండ్రులను కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక భవిత కేంద్రం ఉపాధ్యాయులు లీలాకృష్ణ, శ్రీనివాసరావు, ఆర్.శ్రీకన్యలతో కలిసి దివ్యాంగుల గుర్తింపు సర్వేలో ఎంఈఓ పాల్గొన్నారు. దివ్యాంగ విద్యార్థులకు వారి సామర్థ్యానికి అనుగుణంగా ప్రత్యేక బోధన సామగ్రి, పరికరాలు, ర్యాంప్‌లు, రెయిలింగ్, ఫ్రెండ్లీ టాయిలెట్ వంటి అన్ని సదుపాయాలతో పాఠశాలలు ఉన్నాయన్నారు. అవసరమైన పిల్లలకు ఫిజియోథెరపీ సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. భవిత కేంద్రం సేవలను, ప్రభుత్వం దివ్యాంగుల కోసం ఇస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులను కోరారు.

నిత్య జీవితంలో యోగా భాగం కావాలి



నెల్లిమర్ల రూరల్: సతివాడలో యోగాపై అవగాహన కల్పిస్తూ అధికారుల ర్యాలీ



భోగాపురంలో యోగాంధ్ర ర్యాలీలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది



బాబామెట్ట దేవి పార్కు వద్ద యోగాసనాలు సాధన చేస్తున్న చిన్నారులు

యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా భోగాపురం మండల కేంద్రం సహా నెల్లిమర్ల మండలంలోని సతివాడ గ్రామంలో యోగాపై అవగాహన కల్పిస్తూ సోమవారం ర్యాలీ చేపట్టారు. భోగాపురంలోని కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో గాయత్రి.. సతివాడలోని కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణరాజు మాట్లాడుతూ ప్రతిఒక్కరి నిత్య జీవితంలో యోగా భాగం కావాలని, యోగా సాధన ద్వారా శారీరక ఆరోగ్యం లభించడంతో పాటు మనసుకు ప్రశాంతత చేకూరుతుందన్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం యోగా సాధన చేస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారొచ్చని తెలిపారు.

– నెల్లిమర్ల రూరల్, భోగాపురం

జోరుగా మట్టి తవ్వకాలు



సీతారాంపురం వద్ద లేఅవుట్‌లో పోసిన మట్టి

శృంగవరపుకోట: అధికారం అడ్డంపెట్టుకుని ప్రభుత్వ భూములు చెరువులు, బందలు ఇలా అనువుగా ఉన్న ప్రతిచోట అక్రమార్కులు టన్నుల కొద్దీ మట్టి తవ్వకాలు చేస్తూ వేలరూపాయలు ధనార్జన చేస్తున్నారు. మట్టి తవ్వకాలు తమకు నచ్చిన చోట గోతులు పెట్టి తవ్వేస్తున్నారు. దీనివల్ల వర్షాలు పడి చెరువులు నిండిన వేళ గోతుల్లో పడి పశువులు, మనుషుల ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. ఇబ్బడిముబ్బడిగా మట్టి తవ్వకాలు సాగుతున్నా ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు మాత్రం ఎక్కడా నోరు మెదపక పోవడం చూస్తుంటే ఈ అక్రమ తవ్వకాల వెనుక ప్రభుత్వ పెద్దలు ఉన్నారని స్పష్టంగా తెలుస్తోంది. మండలంలోని గోపాలపల్లి గ్రామంలో డీ పట్టా భూముల్లో ఒక వ్యక్తి అక్రమంగా మట్టి తవ్వి, సీతారాంపురం గ్రామంలోని లేఅవుట్‌లో వేశాడు. సుమారు 500పైగా లోడ్ల మట్టి తవ్వి అమ్ముకుని లక్షల్లో వ్యాపారం చేస్తున్నాడు. ఇదంతా తమ కళ్లముందే జరుగుతున్నా గ్రామస్థాయిలో వీఆర్‌ఏ, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది ఎవరూ నోరు మెదపడం లేదు. అధికారులు పట్టించుకోకపోవడంతో మట్టి మాఫియా పేట్రేగిపోతోంది. ప్రభుత్వ ఖజానాకు రూపాయి కూడా చెల్లించకుండా ఇష్టారాజ్యంగా చెరువులను తవ్వేస్తున్నారు. మట్టిని దోచేస్తున్న భూబకాసురుల ఆగడాలకు ఇకనైనా అధికారులు బ్రేక్ వేయాలని స్థానికులు కోరుతున్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు



రిలే నిరాహార దీక్షల శిబిరంలో ఎంపీపీ సన్యాసి నాయుడు, తదితరులు

మెంటాడ:మండలంలోని బిరసాడవలస గ్రామాన్ని ఆనుకుని ఉన్న కోళ్ల ఫారాన్ని తక్షణమే తరలించాలని కోరుతూ ఆ గ్రామస్తులు కోళ్లఫారం ఎదుట చేస్తున్న రిలే నిరాహార దీక్షలు అయిదో రోజు సోమవారం కొనసాగాయి. వీరికి పలు సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు మద్దతుగా నిలిచి సంఘీభావం తెలుపుతున్నారు. నాలుగో రోజు ఆదివారం నిరాహార దీక్ష శిబిరానికి ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు వెళ్లి వారికి సంఘీభావం తెలిపారు. తక్షణమే కోళ్ల ఫారాన్ని తరలించాలని డిమాండ్ చేశారు. ఈ కోళ్ల ఫారం వల్ల బిరసాడవలసతో పాటు చుట్టు పక్క అయిదు గ్రామాలకు చెందిన ప్రజలు రోగాల పాలవుతున్నారని, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. వైస్ ఎంపీపీ సారికి ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాయిపిల్లి రామారావు, నాయకులు రెడ్డి రాజప్పలనాయుడు, జనసేన నాయకులు సబ్బవరపు రాజశేఖర్, తదితరులు పాల్గొన్నా రు.

కొత్తవలస పోలీస్‌స్టేషన్‌కు సిబ్బంది కొరత

- 40 మంది కానిస్టేబుల్స్‌కు గాను విధుల్లో 17 మంది
- ఉద్యోగ భారంతో అల్లాడుతున్న సిబ్బంది
- పెండింగ్‌లో పలు కేసులు



కొత్తవలస పోలీస్‌స్టేషన్

కొత్తవలస: కొత్తవలస పోలీస్‌స్టేషన్‌ను సిబ్బంది కొరత వేధిస్తోంది.ఈ స్టేషన్ విశాఖ సిటీకి చేరువలో ఉన్నందున పలు రకాల కేసులు నిత్యం నమోదవుతుంటాయి. అలాగే ప్రస్తుత ఏడాదిలో జనవరి నుంచి నేటి వరకు 7 కేసులు నమోదయ్యాయి. కొత్తవలస పరిసర ప్రాంతాల్లో అత్యధికంగా ఉన్న పరిశ్రమలతో భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. వీటన్నింటినీ చక్కదిద్దాలంటే తగినంత సిబ్బంది అవసరం ఉంది. కొత్తవలస పోలీస్‌స్టేషన్‌లో 40 మంది కానిస్టేబుల్స్‌కు గాను కేవలం 17 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. వారిలో చెక్‌పోస్ట్ డ్యూటీలు, సబ్‌జైలు, రోడ్డు భద్రత డ్యూటీలకు ఆరుగురు కానిస్టేబల్స్ వెళ్లిపోవడంతో మిగిలిన 11 మందితో నెట్టుకొస్తున్నారు.గతంలో డైరెక్ట్ ఎస్సైలు ఇద్దరు, ర్యాంకర్ ఎస్సైలు ఇద్దరు ఉండేవారు. ప్రస్తుతం ఒక ర్యాంకర్ ఎస్సై మాత్రమే ఉన్నారు. అలాగే హెచ్‌సీలు 9 మందికిగాను కేవలం నలుగురు మాత్రమే ఉన్నారు. మహిళా కానిస్టేబుల్స్ సైతం అరకొరగానే ఉన్నారు. దీంతో అధిక డ్యూటీ భారంతో సిబ్బంది అల్లాడుతున్నారు. అలాగే ట్రాఫిక్ నియంత్రణలో పూర్తిగా విఫలమవుతున్నారు. స్టేషన్ పరిధిలో జరుగుతున్న దొంగతనాలు, గంజాయి రవాణా వంటి కేసుల ఛేదనలో చతికిల బడుతున్నారు. ఇటీవల నమోదైన ఒక్క కేసును కూడా పోలీసులు ఛేదించలేకపోయారు. దీనిని బట్టి పోలీస్‌స్టేషన్ పరిస్థితి ఎలా ఉందో? సిబ్బంది అవసరం ఎంతో ఉందో అర్థం చేసుకోవచ్చు.

నేలబావి వివాదంపై ఎస్పీకి ఫిర్యాదు

చీపురుపల్లి: మండలంలోని పీకే పాలవలస గ్రామంలో నేలబావి వివాదంపై ఎస్పీ గ్రీవెన్స్‌లో సోమవారం ఫిర్యాదు చేసినట్టు అదే గ్రామానికి చెందిన రెల్లి పార్వతి, వెంకటేష్ దంపతులు తెలిపారు. తమ గ్రామంలో పురాతన కాలం నుంచి వినియోగంలో లేని నేలబావిని గ్రామ పెద్దల తీర్మానం మేరకు పూడ్చివేశామన్నారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు తమ సొంత నిధులతో సిమ్మెంట్ కాంక్రీట్‌తో పల్లెం నిర్మిస్తుండగా గ్రామానికి చెందిన ఓ ఇద్దరు వ్యక్తులు అడ్డుకుని తమపై దౌర్జన్యం చేశారని, భౌతికంగా దాడి చేశారని తెలిపారు. తమను చంపుతామని బెదిరిస్తున్నారని, ఇదే విషయమై చీపురుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఇప్పటికే ఫిర్యాదు చేశామని తెలిపారు.

రైతులకు పూర్తిస్థాయిలో విత్తనాలు అందించాలి

దత్తిరాజేరు: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు పూర్తిస్థాయిలో వారు కోరుకున్న రకాల వరి విత్తనాలు రాయితీపై అందించాలని ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు వ్యవసాయశాఖ అధికారు లకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని తన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మరి కొద్ది రోజుల్లో రైతులు వరి నారుమడులు తయారు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని, త్వరగా విత్తనాల పంపిణీ చేయాలని వ్యవసాయశాఖ అధికారులను కోరారు. పెద్ద,చిన్న రైతులు అనే తేడా చూపవద్దని అన్నారు.

ఉపాధ్యాయుల రిలే నిరాహార దీక్ష



ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు విజయనగరం జిల్లా కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయులు రిలే నిరాహార దీక్షకు సోమవారం దిగారు. ఉపాధ్యాయ బదిలీల్లో ఎస్జీటీ(సెకండరీ గ్రేడ్ టీచర్)లకు మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చేంత వరకు దీక్ష విరమించేది లేదని సంఘ నాయకులు స్పష్టం చేశారు. తమ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మంగళవారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌ను ముట్టడించేందుకు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించిందని తెలిపారు. ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని, గురువులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు డి.శ్రీనివాస్, కె.విజయగౌరి, వి.రవీంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం అర్బన్

కానరాని పరిశుభ్రతా చర్యలు



ఈ చిత్రంలో కనిపిస్తోంది...విజయనగరం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం. నిత్యం జిల్లా ఉన్నతాధికారులు తిరుగాడే ఈ ప్రాంతం పరిసరాలు ప్రస్తుతం ఎండిన ఆకులతో దర్శనమిస్తోంది. ముఖ్యంగా భవన నిర్మాణాల చుట్టూ ఇవి భారీగా ఉండడంతో విషపురుగులు, పాములు ఉంటాయేమోనని సిబ్బంది భయపడుతున్నారు. కలెక్టరు ఉన్నచోటే పరిస్థితి ఇలా ఉంటే..సాధారణ ప్రజానీకం ఉన్నచోట ఇంకెంతలా పారిశుధ్య లోపం కనిపిస్తోందో అర్థం చేసుకోవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

పోస్టల్ పథకాలు ప్రజలకు చేరువచేయాలి



మాట్లాడుతున్న జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్

విజయనగరం టౌన్: పోస్టల్ శాఖ పథకాలను ప్రజలకు చేరువచేయాలని జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ సూచించారు. సేవల్లో ఏపీ సర్కిల్ పరిధిలోని 127 డివిజన్‌లలో విజయనగరం తపాలా శాఖ వెస్ట్ సబ్‌డివిజన్ కార్యాలయం ప్రథమ బహుమతి కైవసం చేసుకుంది. ఈ మేరకు కంటోన్మెంట్ తపాలా కార్యాలయంలో విజయోత్సవ సభ సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. ఉద్యోగులను అభినందిస్తూ పలు సూచనలు చేశారు. పోస్టల్ పథకాలు ప్రజలకు ఉపయోగపడేలా చూడాలన్నారు. ప్రతి పథకంపై ప్రజలు అవగాహన పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ పోస్ట్‌మాస్టర్ ఇ.మధు, ఐపీబీపీ మేనేజరు సతీష్, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తలసరి ఆదాయం పెంచడమే లక్ష్యం

- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీలా గాంధీ



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీలా గాంధీ, వేదికపై ఎంపీపీ జ్ఞానదీపిక, తదితరులు

గజపతినగరం: స్వర్ణాంధ్ర విజన్ ప్లాన్‌లో భాగంగా 2047నాటికి తలసరి ఆదాయం 15శాతం పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, ఆదిశగా ప్రతీ ఒక్కరూ పని చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీళా గాంధీ అన్నారు. గజపతినగరంలోని గ్రామ సచివాలయం–2 పై అంతస్తులో ఏర్పాటు చేసిన స్వర్ణాంధ్ర –2047 విజన్ ప్లాన్ యూనిట్‌ను ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపికతో కలిసి సోమవారం ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతులు సాంప్రదాయ వ్యవసాయంతో పాటు ఉద్యానవన పంటలు సాగు చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ,ఉద్యానవన శాఖ అధికారులు గ్రామాల్లో అవగాహణ సదస్సులు నిర్వహించి రైతులను చైతన్యవంతం చేయాలన్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంభించాలని, ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న డ్రిప్ ఇరిగేషన్, యంత్రపరికాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్, డ్రాగన్ ఫ్రూట్, అరటి, బొప్పాయి, జామ, కొబ్బరి వంటి పంటలను సాగు చేసేందుకు ముందుకు వచ్చే రైతుల కు ప్రభుత్వం ప్రోత్సాహకాలు, సహాయ సహకారాలు అందిస్తుందని వివరించారు. జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, గజపతినగరం, బొండపల్లి, గంట్యాడ మండ లాల తహసీల్దార్‌లు బి.రత్నకుమార్, డి.రాజేశ్వరరావు, నీలకంఠంరెడ్డి, గజపతినగరం, దత్తిరాజేరు,బొండపల్లి,గంట్యాడ మండలాల ఎంపీడీఓలు బి.కల్యాణి, వై.రాజేంద్ర ప్రసాద్, జి.గిరిబాల, వెంకటరమణమూర్తి, స్థానిక సర్పంచ్ నరవ కొండమ్మ, ఈఓపీఆర్డీ సుగుణాకరరావు, పంచాయతీ ఈఓ జనార్దనరావు, తుమ్మికాపల్లి సర్పంచ్ బెల్లాన త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు.

కొట్యాడ హైస్కూల్ హెచ్‌ఎంగా అప్పలనాయుడు



హెచ్‌ఎం అప్పలనాయుడికి స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు

లక్కవరపుకోట: మండలంలోని కొట్యాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా జామి అప్పలనాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో పాటు గ్రామపెద్దలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన హెచ్‌ఎం అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రస్తుత ఏడాదిలో 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లా ద్వితీయ స్థానం సాధించిన విషయం తెలిసిందేనని ఇదే ప్రగతిని కొనసాగించేందుకు సర్వశక్తులా కృషిచేస్తానని చెప్పారు. అనంతరం గ్రామ పెద్దలు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.